
రైతుగుండె చెరువు!


తాళ్లూరు మండలంలో వర్షానికి దెబ్బతిన్న గుమ్మడి తోట


తాళ్లూరు మండలం మాధవరంలో తడిసి బూజు పట్టిన మొక్కజొన్న విత్తనాలు


తాళ్లూరు మండలం కొత్తపల్లిలో పంట మీదే తడిసి పాడైన మొక్కజొన్న కంకులు

- భారీ వర్షం..అపార నష్టం
- తడిసిన మొక్కజొన్న, సజ్జ
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న రైతులు

దర్శి:

రైతుగుండె చెరువైంది. 15 రోజులుగా రోజూ ఆగకుండా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన సజ్జ, మొక్కజొన్న పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారు. రోజురోజుకూ కురుస్తున్న వర్షాలకు రైతు గుండె బరువెక్కి జరిగిన నష్టాల నుంచి ఎవరు ఆదుకుంటారా..అని ఆశగా ఎదురు చూస్తున్నారు. మొక్కజొన్న, సజ్జ వేసిన రైతుల పొలాల్లోకి నీరు వెళ్లింది. అక్కడక్కడా వేసిన బొప్పాయి, గుమ్మడి, మిరప పొలాలు నీట మునిగి ఉరకెత్తాయి. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. ముండ్లమూరు మండలంలో 1060 ఎకరాల్లో సజ్జ పంట వేయగా ఒక్క కెల్లంపల్లిలోనే 130 ఎకరాల్లో సజ్జ వేయగా 80 ఎకరాల సజ్జ పంట పూర్తిగా దెబ్బతిని బూజుపట్టి మొక్క మొలిచింది. మిగిలిన చోట్ల పంట పాక్షికంగా దెబ్బతింది. రైతులు పంటలను కాపాడుకునేందుకు నానాఅగచాట్లు పడ్డారు. పంటను రక్షించుకునేందుకు పట్టలు కప్పుకుని ఎన్ని అగచాట్లు పడ్డా భారీ వర్షాలు కావడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారు. కోసి కుప్పేసిన సజ్జ పూర్తిగా తడిసింది. తాళ్లూరు మండలంలో 1320 ఎకరాల్లో మొక్కజొన్న, 433 ఎకరాల్లో సజ్జ వేశారు. ఓ వైపు మొక్కజొన్నల్లో విత్తనాల తేడాతో గింజలు లేని కండెలు వచ్చి కొంతనష్టం కాగా మూలిగే నక్కపై తాటికాయ పడిన సామెతగా ఇటీవల కురిన వర్షాలు ఉన్న కొద్ది పంటను ముంచేసి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. గ్రామాల్లో వేసిన పంటలు వర్షానికి పాడై రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్నిచోట్ల మొక్కజొన్న పూర్తిగా దెబ్బతింది. సజ్జ పంట కూడా కంకుల్లో మొలకలు వచ్చాయి. దీనికి తోడు మొక్కజొన్న పంట కోసి ఆరబోసి ఉన్నారు. కళ్లంలో వచ్చిన మొక్కజొన్న పూర్తిగా తడిచి గింజకూడా ఇంటికి పోయే పరిస్థితి కనిపించడం లేదు. మరికొన్ని చోట్ల విత్తనాలు తీసి బస్తాలకు ఎత్తుకనే సమాయానికి వర్షాలు ముంచెత్తాయి. విత్తనాలు కూడా తడిసి పూర్తిగా నష్టపోయారు. మొక్కజొన్న ఎకరాకు రూ.40 వేల వరకు ఖర్చు చేసి ఉన్నారు. ఒక్కో రైతు నాలుగు నుంచి ఐదు ఎకరాల వరకు మొక్కజొన్న పండించి ఉన్నారు. దీంతో కండె దశలో ఉన్న కంకులు కూడా దెబ్బతిని బూజు పట్టాయి. దర్శి మండలంలో కూడా సజ్జ పంట కంకులు నల్లగా మారి దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు, అధికారులు

నష్టపోయిన రైతులు పంటలు పరిశీలించేందుకు ఇటీవల కలెక్టర్ తమిమ్ అన్సారియా, మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి దర్శి నియోజకవర్గం వచ్చారు. ముండ్లమూరు మండలం కెల్లంపల్లికి షెడ్యూల్ ప్రకారం రావాల్సి ఉన్నా అక్కడకు రాకుండానే వెళ్లి పోవడంపై రైతులు మండిపడుతున్నారు. రైతులు బాధలు తెలుసుకోవాలని వచ్చే ప్రజాప్రతినిధులు హడావుడి చేసి చేతులు దులుపుకుని వెళ్లిపోయి మమ అనిపించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. నష్టపోయిన అందరి రైతులకు నష్టపరిహారం వస్తుందా లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి:



ఐదెకరాల్లో సజ్జవేశా. సజ్జ పంట చేతికొచ్చే సరికి భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయా. ఎకరాకు పది వేల రూపాయలకుపైగా పెట్టుబడి పెట్టా. పంట కోసినందుకు కూలి ఖర్చులయ్యాయి. పంట ఇంటికి తీసుకెళ్లే సరికి పూర్తిగా నష్టపోయా.

శ్రీనివాసరెడ్డి, రైతు, కెల్లంపల్లి, ముండ్లమూరు మండలం

సజ్జ పూర్తిగా తడిసింది:



వర్షాలకు పంట పూర్తిగా తడిసింది. పంట కుప్ప పోసి ఆరబెట్టుకుని ఇంటికి తీసుకెళ్లాలనుకునే సమయానికి భారీ వర్షాలు వచ్చాయి. మాతో పాటు గ్రామంలో వేసిన అందరూ నష్టపోయారు. కూలీల ఖర్చులు, పంట ఖర్చులు ఎక్కువ అయ్యాయి. ప్రభుత్వం ఆదుకోకపోతే తీవ్రంగా నష్టపోతాం.

శ్రీనివాసులు, కెల్లంపలి

12 ఎకరాల్లో సజ్జ వేశాను:



పూర్తిగా పంట నష్టం వచ్చింది. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. కూలి ఖర్చులతో సహా రెండు లక్షలైంది. చేతికొచ్చిన పంట చేజారి పోయింది. కండెలు, పంట మీద ఉన్న కండెలు నల్లగా మారాయి. మరికొన్ని చోట్ల కండెల్లో మొక్కలు మొలిచాయి.

రామారావు, రైతు, కెల్లంపల్లి

ఐదెకరాల్లో మొక్కజొన్న వేశా:



కోసి కుప్పగా పోశా. గింజలు ఆరబోశా. భారీ వర్షాలు రావడంతో పరదాలు కప్పినా పంట నీట మునిగి నష్టపోయా. ఈ పాటికే కూలీలు ఖర్చులు, పంటలు నాటేందుకు ఖర్చులు రెండు లక్షల వరకు పెట్టుబడులు పెట్టి ఉన్నాం. చేతివరకు వచ్చిన పంట నోటి కాడకు రాకుండా పోయింది. రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే తీవ్రంగా నష్టపోతాం.

మారం లక్ష్మిరెడ్డి, కొత్తపాలెం, తాళ్లూరు మండలం


స్కూల్ వంటగదికి తాళం

- బిల్లు రాలేదని కాంట్రాక్టర్ నిర్వాకం


చాట్లమడ అగ్రహారంలో ఎంపీపీ పాఠశాల వంటగదికి తాళం వేసిన కాంట్రాక్టర్

పెద్దారవీడు: మండలంలోని చాట్లమడ అగ్రహారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వంటగది నిర్మించగా అధికారులు బిల్లు చేయలేదని కంట్రాక్టర్ తాళం వేశాడు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 26 మంది విద్యార్థులు చదువుతున్నారు. 2014- 2015లో సర్వశిక్షాభియాన్ ద్వారా వంటగది నిర్మాణానికి రూ.1.50 లక్షలు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. కంట్రాక్టర్ టీడీపీ ప్రభుత్వంలో వంటగది నిర్మాణం పూర్తి చేశారు. సంబంధిత అధికారులు బిల్లు మంజూరు చేయలేదని పాఠశాల ప్రారంభం జూన్ నెలలో కంట్రాక్టర్ గదికి తాళం వేశారని, డబ్బులు ఇస్తేనే తాళం ఇస్తానని చెప్పారని స్థానికులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజన నిర్వాహకులు ఆరుబయట చేయడంతో ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు, పాలకుల దృష్టికి పలుమార్లు విషయం తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వంట నిర్వాహకులు తెలిపారు. ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు అధికారులు తీసుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంటగదిని ప్రారంభించి నాణ్యమైన ఆహారం తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, నిర్వాహకులు కోరుతున్నారు. ఏఈ శ్రీనివాసులును వివరణ కోరగా వంటగది నిర్మాణానికి సంబంధించిన బిల్లుల విషయంలో అప్పటి అధికారులు మాత్రమే చేయాలని, తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. నాడు-నేడు పథకం ద్వారా వర్షం కురిస్తే జల్లులు లోపల పడుతాయని, వంటగదికి ముందు భాగంలో రేకులు ఏర్పాటు చేశామని ఏఈ తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసులు వివరణ కోరగా గదికి తాళం వేయడానికి కంట్రాక్టర్‌కు సంబంధం లేదని, బిల్లు విషయం ఉంటే సంబంధిత అధికారుల ద్వారా కంట్రాక్టర్ బిల్లు మంజూరు చేయించుకోవాలని, వంటగదిని త్వరలో స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

పొలాల్లో నీరు లేకుండా చూసుకోవాలి


దొనకొండ: వరి పంట పరిశీలిస్తున్న ఏఓ


పెద్దదోర్నాలలో..


తాళ్లూరు: రైతులకు సూచనలిస్తున్న ఏఓ ప్రసాద్‌రావు


మిరప పంటను పరిశీలిస్తున్న రవి వెంకన్నబాబు

దర్శి: మిరప, బొప్పాయి పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఎం.రవి వెంకన్నబాబు సూచించారు. మండలంలోని చందలూరు, మారెడ్డిపల్లె గ్రామాల్లో నీటమునిగిన బొప్పాయి, మిరప పంటలను ఆయన మంగళవారం పరిశీలించి వారికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా రవి వెంకన్నబాబు మాట్లాడుతూ బొప్పాయి తోటలో నీరు బయటకు వెళ్లబెట్టిన తర్వాత 13:0:45 మందును ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాఫర్ అక్సీక్లోరైడ్ లేదా సాఫ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి నీరు నిలవబడిన ప్రాంతాల్లో మొక్కలు మొదలు దగ్గర పోసి వేరుకుళ్లు తెగులు ఆశించకుండా చేసుకోవచ్చన్నారు.రానున్న రోజుల్లో వర్ష సూచనలు ఉన్నందున పొలంలో నీరు నిలబడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉద్యాన సహాయకులు డి. జాన్, రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరు (దర్శి): ట్రైకోడెర్మా విరిడితో వేరుకుళ్లు, మాగుడు తెగులు, ఎండు తెగుళ్లను సమర్థంగా అరికట్టవచ్చని వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు సూచించారు. మండలంలోని తాళ్లూరు-1,2, ఆర్ఎస్‌కేల పరిధిలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ ట్రైకోడెర్మా విరిడీని నాలుగు కిలోలు చొప్పున ఎకరాకు ఇసుకతో కలిపి, వేపపిండితో బాగా చిలికిన పశువుల ఎరువుతో కలిపి తేమ ఉన్నప్పుడు వేయాలన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు కలపకూడదన్నారు. దీన్ని చల్లని పొడి ప్రదేశంలో నిల్వ చేసుకోవాలని, పంటలు ఏ దశలో ఉన్నప్పుడైనా వేసుకోవచ్చని తెలిపారు. డ్రిప్ ద్వారా లేదా నీటిలో కలిపి పైర్లపై పిచికారీ చేసుకోవచ్చని చెప్పారు. ఈ మందును వేరుశన, పత్తి, పొగాకు, మిరప, పొద్దుతిరుగుడు, వంగ, బెండ, నిమ్మ, బత్తాయి అనేక రకాల పంటల్లో వాడుకోవచ్చన్నారు. పండ్ల తోటల్లో ఎండు తెగులు నివారణకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వీఏఏ నాగరాజు నాయక్, ఎలీషా, అమృత పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ మంగళవారం మండల పరిధిలోని చిన్నదోర్నాల, జమ్మిదోర్నాలలో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి మిర్చి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంటలపై సస్యరక్షణ చర్యలు వివరించారు. రబీ కాలంలో ఆరుతడి పంటలైన మినుము, శనగ, రాగులు సాగు చేయాలని చూసించారు. కంది పంటలో ఆకుగూడు పురుగు నివారణకు 5 శాతం వేపగింజల కషాయం, లీటర్ నీటికి 5 మిల్లీ మీటర్ల కలిపి పిచికారీ చేయాలన్నారు. వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలో వరి సాగు చేసుకున్న రైతులు ఆకు చుట్టు పురుగు నివారించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ ఏడాది సాగర్ కాలవ కింద సుమారు 600 ఎకరాల్లో రైతులు వరి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా. మండలంలోని చందవరం, పోలేపల్లి రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో కలిసి వరి పొలాలను సందర్శించి పలు సూచనలు, సలహాలందించారు. ప్రస్తుతం వరి పైరులో ఆకు చుట్టు పురుగు ఆశించిందని, ఈ పురుగు ఆకు రెండు చివరలను కలిపి గూడు కట్టి లోపల ఉంటూ పత్ర హరితాన్ని తినటంతో ఆకు తెల్లగా మారుతుందన్నారు. దీనినే తెల్ల తెగులు అని పిలుస్తారన్నారు. అక్కడక్కడా ఆకు కొనలు ఎరుపులోకి మారి ఎండిపోతాయన్నారు. దీన్ని నివారించడానికి ఎకరాకు 25 కేజీల పొటాష్ ఎరువు వాడాలన్నారు. రైతులు నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించి సూచించిన మోతాదులో పొటాష్ ఎరువు వాడాలన్నారు. ఆయన వెంట సహాయకులు సురేంద్ర, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: ఇటీవల కురిసిన వర్షాలకు మిరప పంటల్లో నీరు నిల్వ ఉంటే వెంటనే బయటకు పంపాలని ఉద్యానవనశాఖాధికారి డి. ప్రత్యూష సూచించారు. మండలంలోని పడమరనాయుడుపాలెం, ఆవులమంద గ్రామాల్లోని మిరప పంటలను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. ఉద్యాన విస్తరణాధికారి ధనలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కరపత్రంలో నిందారోపణలు సరికాదు

కురిచేడు: ఎంఈఓలపై విడుదలైన కరపత్రంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ శివరామకృష్ణ పేరు చేర్చి నిందారోపణ చేయడం సరికాదని ఆ సంఘ మండల శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజారహంతుల్లా ఖండించారు. కొందరు ఎంఈఓ ఆఫీసులో లీలలు అనే కరపత్రాన్ని ముద్రించి గ్రామంలో వెదజల్లారన్నారు. వాట్సాప్, ఇతర సోషల్ మీడియాలో ఈ కరపత్రాన్ని సర్క్యులేట్ చేశారని చెప్పారు. ఎంఈఓ-2, ఇతర అధికారులకు టీచర్ల నుంచి డబ్బులు వసూలు చేసి వారికి ఇస్తున్నట్లు, టీచర్ల సంఘాలు కూడా ఎంఈఓలకు వత్తాసు పలుకుతున్నట్లు కరపత్రంలో ముద్రించారన్నారు. ఈ విధంగా యూనియన్ బాధ్యుల పరువుకు నష్టం కలిగించే విధంగా కరపత్రాన్ని ముద్రించారన్నారు. ఇవన్నీ నిరాధారమని, ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయుల హక్కులకై పోరాటం చేస్తాయని తప్ప అధికారులకు నాయకులు కొమ్ము కాయరని స్పష్టం చేశారు. విధులు సక్రమంగా నిర్వర్తించని, సమయపాలన పాటించని కొంతమంది ఉపాధ్యాయులు కరపత్రం ముద్రణ వెనుక ఉండి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కరపత్రంలో పేర్కొన్న ఆరోపణలు రుజువు చేయాల్సిన అవసరం దాన్ని ముద్రించిన వారికి ఉందని ఖాజారహంతుల్లా స్పష్టం చేశారు.

మద్యం ఎమ్మార్పీకి విక్రయించకుంటే చర్యలు


మద్యం షాపును పరిశీలిస్తున్న సీఐ, సిబ్బంది

దర్శి: మద్యం ఎమ్మార్పీకి విక్రయించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని ఐదు మద్యం దుకాణాలు, రూరల్‌లోని నాలుగు మద్యం దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్నీ దుకాణాల వద్ద మద్యం ధరలు ఫ్లెక్సీల పట్టిక వేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దవుతాయని హెచ్చరించారు. అధికమొత్తంలో మద్యం బయట అమ్మినా, బెల్టు షాపులు నిర్వహించినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు.

విద్యుత్ మోటార్ల చోరీ

కురిచేడు: స్థానిక ఆవులమంద రోడ్డులోని యర్రకుంట వద్ద విద్యుత్ మోటార్లు చోరీ అయ్యాయి. మంగళవారం సాయంత్రం గొర్రెల కాపరులను చూసి దొంగలు పరారైనట్లు గొర్రెల కాపరులు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతంలో పొలాలు గల రైతులు తమ పొలాలకు వెళ్లి మోటార్లు పరిశీలించుకుంటున్నారు. ఎన్ని మోటార్లు చోరీ జరిగింది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి

త్రిపురాంతకం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని ఎంపీడీఓ రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్యంపై గ్రామస్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం పెరిగితే సీజన్ వ్యాధులు ప్రబలతాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో విద్యాధికారి భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ రాజశేఖరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శ్రీకాంత్, ఈఓపీఆర్‌డీ రామకోటయ్య సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రసాద్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం


ప్రసాద్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గాలి ప్రసాద్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక పొదిలి రోడ్డులో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గాలి ప్రసాద్‌రెడ్డి మృతదేహానికి మంగళవారం ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న యువకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

దర్శి: పోలీస్ అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా దర్శి తాలూకా క్లబ్ సమావేశం హాలులో మంగళవారం జరిగిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 169 మంది యువకులు రక్తదానం చేశారు. డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలకు గుర్తుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. రక్తదానంతో ఆపదలో ఉన్న ఎందరికో ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్సైలు మురళి, నాగరాజు, మల్లికార్జున, బ్రహ్మనాయుడు, వేమన, శివ, శివబసవరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద చిత్తడి


దర్శి పోలీసుస్టేషన్ ఎదుట..

దర్శి: 15 రోజులుగా ఆగకుండా కురుస్తున్న వర్షాలకు దర్శి పోలీస్‌స్టేషన్ ఎదుట పెద్ద పెద్ద గుంతల్లో నీరు నిలిచి రొచ్చురొచ్చుగా తయారైంది. వాహనదారులు, పాదచారులు రెవెన్యూ ప్రాంగణంలోని ట్రెజరీ, సబ్‌జైల్, రెవెన్యూ కార్యాలయాల్లోకి వెళ్లాలంటే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నీరు నిల్వ ఉండటంతో అక్కడ నిలబడాలన్నా పగలే దోమలు విలయ తాండవం చేస్తున్నాయి. గడియారం స్తంభం సెంటర్‌లో రోడ్లపై కూడా అదే దుస్థితి నెలకొంది. రోజూ కురుస్తున్న వర్షానికి అధికారులు చర్యలు తీసుకుని గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

రీసర్వేలో సమస్యలు ఉంటే తెలియజేయాలి

దర్శి: గ్రామంలో రీసర్వేపై సమస్యలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ సూచించారు. మండలంలోని తుమ్మెదలపాడులో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు పెట్టామని చెప్పారు. తమకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ నలదిమ్మ వెంకట శేషిరెడ్డి, వీఆర్వో, సర్వేయర్ పాల్గొన్నారు.

గంగదేవిపల్లి పాఠశాల వార్షిక తనిఖీ

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి-2 షేక్ అమీర్‌బాషా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమాధానం రాబట్టారు. ఉపాధ్యాయులకు సూచన, సలహాలందించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం తయారు చేయాలని కుకింగ్ నిర్వాహకులకు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా పాఠశాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీఆర్‌పీలు ఉన్నారు.

మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలి

దర్శి: ప్రతి విద్యార్థి మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలని ప్రధానోపాధ్యాయురాలు బడుగు విజయలక్ష్మి అన్నారు. మండలంలోని బండి వెలిగండ్లలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి విద్యార్థులతో కలిసి పాఠశాలల ఆవరణలో రకరకాల మొక్కలు నాటారు. విజయలక్ష్మి మాట్లాడుతూ మొక్కలు పెంచి పెద్ద చేసే బాధ్యత నాటిన వారు తీసుకోవాలని సూచించారు. ప్రతి మొక్కను పెద్దది చేయాలన్నారు. ఉపాధ్యాయులు తిరుపతమ్మ, మాలకొండయ్య, గోవిందయ్య, షేక్ ఖాశీం పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 34 మంది ఉద్యోగాలకు ఎంపిక

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 34 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 2 కంపెనీలు హాజరయ్యాయని, 65 మంది అభ్యర్థులు పాల్గొన్నారని చెప్పారు. కంపెనీ హెచ్‌ఆర్‌లతో పాటు వైస్ ప్రిన్సిపాల్ పి.ప్రదీప్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ బి.విజయకుమారి, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి షేక్ ఈష్ బాషా పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన కృష్ణాజిల్లా, మచిలీపట్నం, M/s.NSP (నవ్య సాయి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్) తరుపున మేనేజింగ్ డైరెక్టర్ అయిన శ్రీ సానా వెంకట రెడ్డి గారి కుమారుడు సానా నారాయణ రెడ్డి గారు ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ గ్రామ పంచాయితీ లోని సర్వే నెం:668/2, 678/1, 669/2, 678/2, 676/9, 683/1F, 683/1H, 676/8, 680, 683/1Gరు దాఖలా యః 98.99ట్లు భూమిని సదరు క్రింద తెలిపిన 1-4 భూ యజమానుల నుండి కొనదలచి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, సదరు షెడ్యూలు 1-4 వ అయిటంల దాఖలా ఆస్థులను, సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో నిర్వివాదముగా, అనుభవించుచూ మా క్లయింటుకు విక్రయించుటకు ఖరారు పడి వారి నుండి క్రయ అడ్వాన్సు, క్రయ ప్రతిఫలమును తీసుకొని ఉండిరనియూ, ప్రస్తుతము మా క్లయింటు సదరు వారలకు బ్యాలన్సు క్రయ ప్రతి ఫలమును చెల్లించి రిజిష్టరు విక్రయ దస్తావేజులు పొందుటకు సిద్ధముగా వుండి యున్నారనియూ, సదరు క్రయములను గురించి ఎవరైనా తనఖా, విక్రయ అగ్రిమెంటు, దీర్ఘకాలపు లీజు, ఇన్ జంక్షన్, మనోవర్తి, జాయింట్ మనోవర్తి, జాయింటు భాగాలబ్ది తగాయిదాలు, వగైరా ఎటువంటి క్లయిములువున్నా, సదరు అక్షేపణలను, క్లయిములను ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజుల లోపుగా వ్రాతపూర్వకంగా రిజిష్టరు పోస్టు తిరుగు రశీదు ద్వారా మాకు తెలియపరచవలెను. దరిమిలా వచ్చే క్లయిములు మాక్లయింటును బైండు చేయజాలవనియూ అందరికిని తెలియజేయడమైనది.

దిగువ షెడ్యూల్ దాఖలా 1వ వారి నుండి: పశ్చిమగోదావరి జిల్లా, పోడూరు మండలం, మెట్టుపల్రు పోస్ట్, డోర్ నెం: 1-28, మెయిన్‌రోడ్ కాపురస్తులు విద్యంశెట్టి సుబ్బారావు గారి కుమారుడు **విద్యంశెట్టి రంగారావు** గారు బోయిళ్ళ ఓబుల్ రెడ్డి గారి కుమారులు 1) బోయిళ్ళ రాజశేఖర్ రెడ్డి, 2) బోయిళ్ళ వెంకటేశ్వర రెడ్డి గారి నుండి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీతో కూడిన స్వాధీన అగ్రిమెంట్ ద్వారా విక్రయం పొంది గిద్దలూరు యస్.ఆర్.ఓ.లో ది.**31/07/2007. ద.నెం.2064/2007**రుగా రిజిష్టరు పొందిన క్రయ దస్తావేజు రీత్యా సర్వ హక్కులు సంక్రమించబడి, దరిమిలా వారి పేరిట పొందినట్టిన్నీ, ఆస్తిన్నీ,

దిగువ షెడ్యూల్ దాఖలా 2వ వారి నుండి: పశ్చిమగోదావరి జిల్లా, మెట్టుపల్రు, యం.పి.యు.పి.స్కూల్ దగ్గర, డోర్ నెం: 1-22, మెయిన్‌రోడ్ కాపురస్తులు విద్యంశెట్టి రంగారావు గారి కుమారుడు విద్యంశెట్టి సత్యనారాయణ గారు ఈదుల స్వామిరంగారెడ్డి గారి భార్య 1) ఈదుల సరస్వతి, ఈదుల స్వామి రంగారెడ్డి గారి కుమారుడు 2) ఈదుల సుధీర్‌రెడ్డి గార్ల నుండి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీతో కూడిన స్వాధీన అగ్రిమెంట్ వలన విక్రయం పొంది గిద్దలూరు యస్.ఆర్.ఓ.లో ది.**31/07/2007. ద.నెం.2068/2007**రుగా రిజిష్టరు పొందిన క్రయ దస్తావేజు రీత్యా సర్వ హక్కులు సంక్రమించబడి, దరిమిలా వారి పేరిట పొందినట్టిన్నీ, ఆస్తిన్నీ,

దిగువ షెడ్యూల్ దాఖలా 3వ వారి నుండి: పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు, జోసు శిబిరం రోడ్, గాంధీనగర్, డోర్ నెం: 20సి-1-27 కాపురస్తులు కొండ్రోతు బంగారయ్య గారి కుమారుడు **కొండ్రోతు బాబూరావు** గారు బోయిళ్ళ ఓబుల్ రెడ్డి గారి కుమారుడు బోయిళ్ళ పూర్ణచంద్రారెడ్డి గారి నుండి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీతో కూడిన స్వాధీన అగ్రిమెంట్ వలన విక్రయం పొంది గిద్దలూరు యస్.ఆర్.ఓ.లో ది.**31/07/2007. ద.నెం.2063/2007**రుగా రిజిష్టరు పొందిన క్రయ దస్తావేజు రీత్యా సర్వ హక్కులు సంక్రమించబడి, దరిమిలా వారి పేరిట పొందినట్టిన్నీ, ఆస్తిన్నీ,

దిగువ షెడ్యూల్ దాఖలా 4వ వారి నుండి: పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు రెవెన్యూ మండలం, పాలకొల్లు నజీ.డి. బంగారు వారి చెర్వు గట్టు, డోర్ నెం: 21-5-5 కాపురస్తులు కర్నేన అప్పలస్వామి గారి కుమారుడు కర్నేన గౌరునాయుడు గారు ఈదుల చిన్న రంగారెడ్డి గారి కుమారుడు 1) ఈదుల స్వామి రంగారెడ్డి, ఈదుల స్వామి రంగారెడ్డి గారి కుమారుడు 2) ఈదుల రాజభరత్ రెడ్డి గార్ల నుండి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీతో కూడిన స్వాధీన అగ్రిమెంట్ వలన విక్రయం పొంది గిద్దలూరు యస్.ఆర్.ఓ.లో ది.**31/07/2007. ద. నెం. 2067/2007**రుగా రిజిష్టరు పొందిన క్రయ దస్తావేజు రీత్యా సర్వ హక్కులు సంక్రమించబడి, దరిమిలా వారి పేరిట పొందినట్టిన్నీ, ఆస్తిన్నీ,

షెడ్యూలు దాఖలా.

1వ అయిటం:- (a) ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ దాఖలా సర్వే నెం:668/2లోని యః 6.67సెంట్లు, **తూర్పు:-** చెరువు, **దక్షిణం:-** బైకలూరు రాజు గారి భూమి, **పడమర:** నాకు జనరల్ పవర్‌గా ఇచ్చిన భూమి, **ఉత్తరం:** చెరువు, ఈ హద్దుల మధ్య గల యః06.67సెంట్లు (ఆరు యకరాల అరవైఏడు సెంట్లు) మెట్టభూమి.

(b) ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ దాఖలా సర్వే నెం:678/1లోని యః 5.00సెంట్లు, భూమికి హద్దులు **తూర్పు:-** గవర్నమెంట్ భూమి, **దక్షిణం:-** కుంట, **పడమర:-** గవర్నమెంట్ భూమి, **ఉత్తరం:** రస్తా మరియు గవర్నమెంటు భూమి, ఈ హద్దుల మధ్య గల యః 05.00సెంట్లు (ఐదు యకరాలు) మెట్టభూమి.

(c) ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ దాఖలా సర్వే నెం:669/2లోని యః 6.69సెంట్లు, భూమికి హద్దులు **తూర్పు:-** నాకు జనరల్ పవర్‌గా ఇచ్చిన భూమి, **దక్షిణం:-** బైకలూరు రాజు గారి భూమి, **పడమర:-** బలరామిరెడ్డి వగైరాల భూమి మరియు గవర్నమెంటు భూమి, **ఉత్తరం:-** నాకు జనరల్ పవర్‌గా ఇచ్చిన భూమి, ఈ హద్దుల మధ్య గల యః06.69సెంట్లు (ఆరు యకరాల అరవై తొమ్మిది సెంట్లు) మెట్టభూమి.

(d) ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ దాఖలా సర్వే నెం:678/2లోని యః 5.01 సెంట్లు, భూమికి హద్దులు **తూర్పు:** గవర్నమెంట్ భూమి, **దక్షిణం:-** కుంట, **పడమర:-** గవర్నమెంట్ భూమి, **ఉత్తరం:** రస్తా మరియు గవర్నమెంటు భూమి, ఈ హద్దుల మధ్య గల యః05.01 సెంట్లు (ఐదు యకరాల ఒక సెంటు) మెట్టభూమి.

2వ అయిటం: - (a) ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ దాఖలా సర్వే నెం:676/9లోని యః.5.00సెంట్లు, భూమికి హద్దులు **తూర్పు:-** సాగిరాజు సోమరాజు గారి భూమి, **దక్షిణం:-** సర్వే నెం: 677రు భూమి, **పడమర:-** సాగిరాజు సోమరాజు గారి భూమి మరియు రస్తా, **ఉత్తరం:-** సాగిరాజు సోమరాజు వగైరాల భూమి, ఈ హద్దుల మధ్య గల యః05.00సెంట్లు (ఐదు యకరాలు) మెట్టభూమి.

(b) ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ దాఖలా సర్వే నెం:683/1F లోని యః 8.72సెంట్లు, భూమికి హద్దులు **తూర్పు:-** సర్వే నెం: 676రు భూమి, **దక్షిణం:-** సర్వే నెం: 683/2రు భూమి, **పడమర:-** సర్వే నెం: 682రు భూమి మరియు వగైరాల భూమి, **ఉత్తరం:-** సర్వే నెం: 683/1రు భూమి, ఈ హద్దుల మధ్య గల యః08.72సెంట్లు (ఎనిమిది యకరాల డెబ్బై రెండు సెంట్లు) మెట్టభూమి.

(c) ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ దాఖలా సర్వే నెం:683/1Hలోని యః.13.45 సెంట్లు, భూమికి హద్దులు **తూర్పు:-** సాగిరాజు సోమరాజు గారి భూమి మరియు టోర్ర వెంకట్రామయ్య గార్ల భూములు, **దక్షిణం:-** ఈదుల సరస్వతి గారి జనరల్ పవర్‌గా ఇచ్చిన భూమి, **పడమర:-** సర్వే నెం: 682, 681ర్ల భూములు, **ఉత్తరం:-** ఈదుల రాజభరత్ రెడ్డి గారి భూమి, ఈ హద్దుల మధ్య గల యః13.45 సెంట్లు (పదమూడు యకరాల నలభై అయిదు సెంట్లు) మెట్టభూమి.

3వ అయిటం:- ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ దాఖలా సర్వే నెం:676/8లోని యః.23.00సెంట్లు, భూమికి హద్దులు **తూర్పు:-** జల్లి ఓబయ్య వగైరాల భూమి, **దక్షిణం:-** ఈ నెంబరులో జనరల్ పవర్‌గా ఇచ్చిన భూమి మరియు రస్తా, **పడమర:-** సర్వే నెం: 683 భూమి, **ఉత్తరం:-** సాగిరాజు సోమరాజు వగైరాల భూమి, ఈ హద్దుల మధ్య గల యః23.00సెంట్లు (ఇరవై మూడు యకరాలు) మెట్టభూమి.

4వ అయిటం: - (a) ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ దాఖలా సర్వే నెం:680లోని యః.12.00సెంట్లు, **తూర్పు:-** సర్వే నెం: 682రు భూమి, **దక్షిణం:-** సర్వే నెం: 679రు భూమి, **పడమర:-** సర్వే నెం: 690రు భూమి, **ఉత్తరం:-** ఈ నెంబరులో ఓబయ్య గారి భూమి మరియు రస్తా, ఈ హద్దుల మధ్య గల యః12.00సెంట్లు (పన్నెండు యకరాలు) మెట్టభూమి.

(b) ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, దద్దవాడ గ్రామ దాఖలా సర్వే నెం:683/1Gలోని యః.13.45 సెంట్లు, భూమికి హద్దులు **తూర్పు:-** సాగిరాజు సోమరాజు గారి భూమి మరియు టోర్ర వెంకట్రామయ్య గార్ల భూములు, **దక్షిణం:-** విద్యంశెట్టి సత్యనారాయణ గారు జి.పి.ఎ.పొందిన భూమి, **పడమర:-** సర్వే నెం: 681రు భూమి, **ఉత్తరం:-** సర్వే నెం: 683/1రు భూమి, ఈ హద్దుల మధ్య గల యః13.45 సెంట్లు (పదమూడు యకరాలు నలభై ఐదు సెంట్లు) మెట్టభూమి.

1 నుండి 4 వరకు గల అయిటంలు వెరశి యః98.99సెంట్లు భూమికి లోగడ వలనే భూములు మార్గము మరియు సదరాస్థిపై యూజ్‌మెంటు హక్కులు కలవు.

Dt: 22-10-2024

VIJAYAWADA

ఇట్లు

డి. సాయి శుభశ్రీ, ఎల్. ఎల్.యం,

కె.వి.ఎస్.డి.రవి తేజ, ఎల్. ఎల్. యం, (U.K). అడ్వకేట్స్,

#20-4-15/1, 'శ్రీనివాసమ్', సెక్టార్.1, 2వ గేటు,

లోటస్ ల్యాండ్ మార్క్, 5వ లైను,

కేదారేశ్వరి పేట్, విజయవాడ-520003.

ఫోన్ నెం: +91-8639321446, +91-8919420544.